క్లుప్తంగా

ఎంపీ మోపిదేవి దీపావళి శుభాకాంక్షలు

రేపల్లె: ప్రతి ఒక్కరి జీవితాల్లో అంధకార చీకట్లు తొలగి కోటి దివ్వెల వెలుగులు నిండాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు ఆకాంక్షించారు. నియోజకవర్గ ప్రజలకు శనివారం ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. దీపకాంతుల జ్యోతులతో, ఆనంద సంపదల రాశులతో, టపాసుల వెలుగులతో ప్రతి ఒక్కరూ దీపావళి పండుగను వైభవంగా జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సిరి సంపదలతో, పాడిపంటలతో ఆనందంగా ఉండాలని శుభాకాంక్షలు తెలిపారు.

14న ఉచిత డయాబెటిక్ వైద్యశిబిరం



పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు గ్రామంలో ఈనెల 14వ తేదీన ఉచిత డయాబెటిక్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు బుడే సాహెబ్ మెమోరియల్ సొసైటీ వ్యవస్థాపకులు రెహమాన్ తెలిపారు. అల్లూరులో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుడేసాహెబ్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈశిబిరంలో షుగర్ వ్యాధి నిపుణులు, సాధారణ వైద్యనిపుణులు పాల్గొంటారని, పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సొసైటీ సభ్యుడు శ్రీనివాసరావు ఉన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

భట్టిప్రోలు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 14 నుంచి 20వ తేదీవరకు భట్టిప్రోలులోని శ్రీ మాటూరు రామారావు శాఖా గ్రంథాలయాలలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కలపాల సుభాష్ చంద్రబోస్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. 14న బాలల దినోత్సవం, వారోత్సవాలు ప్రారంభం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ప్రముఖ వ్యక్తుల గూర్చి ప్రశంసలు, రచయితల సందేశాలు, 17 కవి సమ్మేళనాలు, 18న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, నిర్వహించి 20న ముగింపు రోజున బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘన జీవామృతంతో ఖర్చులు ఆదా

వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామ ఉప సర్పంచ్ జంగం వాసు గత రెండేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం వాసు పంట పొలం వద్ద ఎరువులు వినియోగించకుండా ఆవు పేడ, మూత్రం, శనగపిండి, బెల్లం, పుట్టమట్టి కలిపి ఘన జీవామృతం ఎరువు తయారు చేసి చల్లుకునే విధానాన్ని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ఈ విధానాన్ని అవలంబించడం వల్ల ఖర్చు ఆదా అవ్వడమే కాక అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. అలాగే గ్రామానికి చెందిన పెరికల ఝాన్సీ రాణి డాబాపై మొక్కలు పెంచి ద్రవ జీవామృతం వినియోగించి కూరగాయలు, ఆకు కూరలు, పూల మొక్కలు, పసుపు, కంద మొక్కలు పెంచి వాటిని ఇంటి అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. ఆమె చేస్తున్న ఈ విధానాన్ని గ్రామస్తులకు తెలియ చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది దోవా ఝాన్సీరాణి, జంగం రత్నరోజా, ఎంటీ బాల, పాప తదితరులు పాల్గొన్నారు.

15న ప్రజారక్షణ భేరీ

భట్టిప్రోలు: సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే ప్రజా రక్షణ భేరీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు టి.కృష్ణమోహన్ శనివారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భట్టిప్రోలులోని రథం సెంటర్‌లో ప్రజలకు కరపత్రాలను అందించి ప్రచారం నిర్వహించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మోదీని గద్దె దించి దేశాన్ని రక్షించాలని ప్రజలను కోరారు. సీపీఎం నాయకులు ఎం.సత్యన్నారాయణ, పి.మనోజ్, బి.నాగమల్లేశ్వరరావు, పి.అహరోను, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

280 మందికి కళ్లజోళ్లు పంపిణీ

రేపల్లె: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఇటీవల నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో శస్త్రచికిత్సలు పొందిన 280 మందికి పట్టణంలోని వీరవపల్లి కోటయ్య ఫంక్షన్ హాలులో శనివారం ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు రుతూజా వృద్ధులకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ సభ్యులు సక్సేనా, రామచంద్రరావు, సుబ్రహ్మణ్యం, పావులూరి శివశంకర్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

- కుట్రలు, కుతంత్రాల పొత్తులు చంద్రబాబు నైజం
- గ్రామస్థాయిలో బూత్‌లెవల్ ఏజెంట్లు నిస్వార్థంగా పనిచేసి పార్టీ విజయానికి కృషిచేయాలి
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్: ప్రజా సంక్షమమే లక్ష్యంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కుట్రలు, కుతంత్రాల పొత్తులతో రాబోయే ఎన్నికల్లో ఢీకొనేందుకు సిద్ధమవుతున్న చంద్రబాబును, ఆయన పార్టీని కూకటివేళ్లతో పెకలించే దిశగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోలింగ్‌బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల, మత పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను గడప గడపకు అందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సుల్లో చెరగని ముద్రవేసుకున్నారన్నారు. ప్రజాభిమానం చూరగొన్న జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించేందుకు చంద్రబాబు జనసేనతో జతకట్టాడన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు జనసేనతో పొత్తుపెట్టుకుని తెలంగాణలో పోటీలోనే లేకుండా ఉన్నారన్నారు. అయితే పవన్‌కల్యాణ్ ఏపీలో చంద్రబాబుతో పొత్తు అంటూ తెలంగాణలో బీజేపీతో కలిసి రాజకీయ విలువలకు పాతరవేస్తున్నారన్నారు. నాలుగు సంవత్సరాల కాలంలో జగన్‌మోహన్ రెడ్డి చేసిన మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటుగా మలుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రెండు జెండాల రాజకీయాలకు గ్రామస్థాయిలో నాయకులు స్వస్తి పలికి నీతి, నిజాయితీతో పార్టీ విజయానికి పనిచేయాలన్నారు. డిసెంబర్ 9వ తేదీవరకు ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులకు అవకాశం ఉంటుందని బూత్‌లెవల్‌లో ప్రతి ఒక్కరూ ఓటర్ల జాబితాలను పరిశీలించాలన్నారు. డబుల్ ఎంట్రీలుగా ఉన్న వారిని గుర్తించి తొలగింపుకు నివేదించాలన్నారు. సమావేశంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ కన్వీనర్‌లు గడ్డం రాధాకృష్ణమూర్తి, గాదె వెంకయ్యబాబు, పయనం ఏడుకొండలు రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, ఎంపీపీలు మత్తి దివాకర రత్నప్రసాద్, చింతల శ్రీకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు

ఎమ్మెల్యే కోన రఘుపతి



చింతాయపాలెంలో మల్లకంబ్ ఎంపిక పోటీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉంటారని, వీరికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీ 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జరుగుతున్న సైక్లింగ్, మల్లకంబ్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీలను ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలతో క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆడి విజేతలుగా నిలవాలన్నారు. పీఈటీ ఎం.గోపి మాట్లాడుతూ సైక్లింగ్, మల్లకంబ్ రాష్ట్ర జట్టును ఎంపిక చేసేందుకు సెలక్షన్ పోటీలు జరుగుతున్నాయని, రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు జాతీయస్థాయి జరిగే పోటీలలో పాల్గొంటారని చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం వెంకట కృష్ణరాజు, ఎంఈఓ విజయశ్రీ, ఎంపీటీసీ సభ్యుడు రాతంశెట్టి లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన

వేమూరు: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెరవలి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.వెంకట సురేష్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కుష్ఠు వ్యాధి వ్యాప్తి చెందుతుంది, దాని లక్షణాలు, నివారణ మార్గాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా అధికారి ఎం.బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు అబుల్ కలామ్ ఆజాద్

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం అధ్యక్షుడు పఠాన్ రాజేష్ ఆధ్వర్యంలో శనివారం బాపట్ల పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పఠాన్ రాజేష్ మాట్లాడుతూ దేశంలో విద్యవ్యవస్థ అభివృద్ధికి మౌలానా ఆజాద్ ఎంతో కృషి చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్స్ నక్కల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న అంబేడ్కర్ యూత్ నిర్వాహకులు

భట్టిప్రోలు: భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావుకు శనివారం అంబేడ్కర్ యూత్ వినతిపత్రం అందించారు. మేజర్ పంచాయతీ భట్టిప్రోలులో అంతర్భాగమైన అద్దేపల్లి ఎస్సీ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోకపోవడం వివక్ష చూపడమేనని యూత్ నాయకులు పేర్కొన్నారు. కాలనీలో డ్రైయినేజీ నిర్వహణ అధ్వానంగా తయారై తూములు పగిలిపోయి మురుగు నీరు చేరి దుర్వాసన వస్తుందని తెలిపారు. కాలనీల్లో 350 గడప ఉందని ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయడానికి నానా యాతన పడుతున్నామని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్ కుమార్, సంఘ పెద్ద వినోద్, యూత్ సభ్యులు, ప్రకాష్, సుజయ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునరావు, కమిషనర్ విజయసారథి

రేపల్లె రూరల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక మందుగుండు సామగ్రి దుకాణాల వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు అనుసరించాలని తహసీల్దార్ మల్లికార్జునరావు పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక మందుగుండు సామగ్రి విక్రయశాలలను శనివారం మున్సిపల్ కమిషనర్ విజయసారథితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి పొందిన వారు మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పట్టణంలో 24 తాత్కాలిక దుకాణాలు అనుమతులు పొందాయన్నారు. దుకాణాల వద్ద విధిగా నీటితో నింపిన డ్రమ్ములు, ఇసుకతో నింపిన బకెట్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఫైర్ ఇంజిన్‌ను ఏర్పాటు చేశామన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక పురోగతి



కొల్లూరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

కొల్లూరు: సంక్షేమ పథకాల అమలుతో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు ఆర్థిక పురోగతి సాధించగలిగాయని వైఎస్సార్ సీపీ కొల్లూరు మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ అన్నారు. శనివారం కొల్లూరు సచివాలయం-2 పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించడంతోపాటు స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించే బుక్‌లెట్‌లను అందజేశారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అయిల సుబ్బారావు, నాయకులు ఘంట శివరంగారావు, చిలకా ప్రకాశం, ఆళ్లమూడి మధు, బొర్ర నాగేశ్వరరావు, ఎ.పోతురాజు, కొల్లూరు శ్రీను, గుడివాడ సీతయ్య, కళ్యాణం ప్రసాద్ పాల్గొన్నారు.

భట్టిప్రోలులో '...జగనన్నే మా నమ్మకం'



భట్టిప్రోలులో గడపగడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

భట్టిప్రోలు: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బ్రహ్మరథం పడుతున్నారని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరిలు పేర్కొన్నారు. భట్టిప్రోలులో 'బాబు సాకులు మానుకో-జగనన్నే మా నమ్మకం' అనే కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగుతుంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ ప్రజలు చూపుతున్న ఆదరణ మాటల్లో చెప్పరానిదని అన్నారు. తెలంగాణలో టీడీపీ చాప చుట్టి సర్దుకున్నట్లే ఏపీలో కూడా 2024లో సర్దుకోవడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి చిన బుజ్జి, మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పూరి చిన్నారి, తలకొల యలమంద, వేల్పూరి నాగేశ్వరరావు, దాసరి గోపాలరావు, ఉక్కడాల ఆనంద్, యుగంధర్, బుల్లిబాబు, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడప గడపకు తిరిగి ప్రజా ప్రతినిధులు, నాయకుల సంక్షేమ పథకాలను గూర్చి తెలియచేశారు. జెడ్పీటీసీ ఉదయభాస్కరి ఇంటి వద్ద రాత్రి పల్లెనిద్ర చేశారు.

విద్యాభివృద్ధికి కృషిచేసిన ఘనత ఆజాద్‌దే

డీఎస్పీ టి. వెంకటేశులు



అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల లేసి నివాళులర్పిస్తున్న డీఎస్పీ టి.వెంకటేశులు

బాపట్లటౌన్: దేశంలో విద్యాభివృద్ధికి కృషిచేసిన ఘనత అబ్దుల్ కలాం ఆజాద్‌దేనని డీఎస్పీ టి.వెంకటేశులు తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. డీఎస్పీ టి.వెంకటేశులు మాట్లాడుతూ దేశంలో విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు అంకితభావంతో పనిచేసి, 14 సంవత్సరాల వయస్సు వరకు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యను అందించే ఆలోచనను ఆయనే ముందుకు తెచ్చారన్నారు. ఆడపిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో అనేక పథకాలను తీసుకొచ్చారన్నారు. విద్యారంగానికి చేసిన సేవలకు గుర్తుగా 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతదేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారత రత్న ఇచ్చి గౌరవించిందన్నారు. 2008 నుంచి భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుతుందన్నారు. మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జీవితాన్ని, ఆశయాలను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల పట్టణ సీఐ యు.శ్రీనివాసులు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మధరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హైడ్రోఫోనిక్స్ వ్యవసాయంపై అవగాహన అవసరం

కళాశాల ఏడీ డీడీ స్మిత్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కళాశాల అసోసియేట్ డీన్ డీడీ స్మిత్

బాపట్ల: హైడ్రోఫోనిక్స్ వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.డి.స్మిత్ తెలిపారు. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం హైడ్రోఫోనిక్స్ నూతన వ్యవసాయ శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. హైదరాబాద్‌లోని ఐఏఏ ఫామ్స్ లిమిటెడ్, గ్రో ఫ్రైజ్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి వచ్చిన డాక్టర్ ఎం.సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ ఎ.లక్ష్మిల నైపుణ్యంతో ఈనెల 8 నుంచి 11 వరకు హైడ్రోఫోనిక్స్ అనే నూతన వ్యవసాయ విధానంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో విద్యార్థులకు హైడ్రోఫోనిక్స్‌లోని ప్రతి అంశం గురించి వివరించడమే కాకుండా ప్రతి విద్యార్థితో ప్రాక్టికల్ చేయించారు. డాక్టర్ డీడీ స్మిత్ మాట్లాడుతూ రాష్ట్రం నలుమూలల నుంచి 86 మంది విద్యార్థులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడం హర్షనీయమన్నారు. ఫుడ్ అండ్ సైన్స్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ భవిష్యత్తుతరాలలో వాతావరణంలోని మార్పులతో, పర్యావరణ సమస్యలతో సంబంధం లేకుండా వ్యవసాయంలో హైడ్రోఫోనిక్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. అదేవిధంగా పోస్ట్ హార్వెస్ట్ టెక్నాలజీ సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ హెడ్ డాక్టర్ బీవీఎస్ ప్రసాద్ మిద్దె సాగు గురించి వివరించారు. డాక్టర్ బి.జాన్ వెస్లీ హైడ్రో ఫోనిక్స్ యొక్క ప్రత్యేకతను విద్యార్థులకు వివరిస్తూ భవిష్యత్తులో ఇటువంటి శిక్షణ కార్యక్రమం ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్‌ను అందజేశారు. డాక్టర్ ఆర్.గణేష్ బాబు, డాక్టర్ కె.కృపావతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నటుడు చంద్రమోహన్‌కు స్వరలయ నివాళి

తెనాలి: తెలుగు సినిమా పరిశ్రమలో 800 సినిమాల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు జీవం పోసిన నటుడు చంద్రమోహన్ మరణం తెలుగు చిత్రసీమకు తీరని లోటని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత సాయి లక్కరాజు అన్నారు. సుప్రసిద్ధ నటుడు చంద్రమోహన్ సంతాపసభను శనివారం సాయంత్రం స్వరలయ వేదిక కార్యాలయంలో నిర్వహించారు. చంద్రమోహన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గుంటూరు జిల్లా బాపట్లలో చంద్రమోహన్ అనేక నాటకాలు వేసినట్టు గుర్తుచేశారు. ఆయనతో తనకు కుటుంబ అనుబంధం ఉందన్నారు. శ్రీధర్, నటులు హేమంత్, శ్రీనివాస్, విశ్రాంత అధికారి రమణయ్య, బ్యాంక్ ఉద్యోగ సంఘ నేత రావిపాటి ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న రజక ఆత్మగౌరవ సభ

తెనాలి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట మైదానంలో ఈనెల 26వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు తలపెట్టిన రజక ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు కోరారు. సభలో రజకుల సమస్యలపై చర్చించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. స్థానిక ఎన్జీవో కళ్యాణమండపంలో శనివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించి, ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, రజకులకు రక్షణ చట్టం తీసుకురావాలనీ, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్లతో తలపెట్టిన ఆత్మగౌరవ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది హాజరుకానున్నట్టు చెప్పారు. అన్ని ప్రాంతాల్నుంచి రజక సోదరులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆర్‌వీఎస్ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, కార్యదర్శి పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.